సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 21 । జూలై । 2023



ఘోషా ఆస్పత్రిలో సేవలు భేష్..!

ఉత్తరాంధ్రలో పేరుగాంచిన ఘోషాఆస్పత్రిలో మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు భేషుగ్గా అందుతున్నాయి.

- 8లో



7తులాల బంగారు ఆభరణాల చోరీ

విజయనగరం పద్మావతి నగర్‌లోని ఓ ఇంటిలో దొంగలు పడ్డారు. ఏడుతులాల బంగారు ఆభరణాలు దోచుకుపోయారు.

- 8లో

నేడు ఎంప్లాయ్ గ్రీవెన్స్‌డే

పార్వతీపురం: ఎంప్లాయ్ గ్రీవెన్స్‌డేను కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహిస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. ఉద్యోగులు వ్యక్తిగత ఫిర్యాదులతో సహా ఏ రకమైన ఫిర్యాదులైనా సమర్పించవచ్చన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో ప్రత్యేక ఐడీలతో నమోదుచేస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

212 మందికి నేతన్న నేస్తం

- రూ.50.88 లక్షల ఆర్థిక సాయం

పార్వతీపురం: తిరుపతి జిల్లాలోని వెంకటగిరిలో శుక్రవారం నిర్వహించే కార్యక్రమంలో వైఎస్సార్ నేతన్ననేస్తం పథకం కింద చేనేత కార్మికులకు ఆర్థిక సాయాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేస్తారని చేనేత జౌళి శాఖాధికారి ఐ.ధర్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో విడతలో జిల్లాలోని 212 మంది చేనేత కార్మికులకు చెరో రూ.24వేలు చొప్పున రూ.50.88 లక్షల ఆర్థిక ప్రయోజనం కలగనుందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో చేనేత కార్మికులు హాజరుకావాలని కోరారు.

పడవ ప్రయాణం



వంశధార నదిలో పడవ నడుపుతున్న జాలర్లు

భామిని: వంశధార నదిలో పడవ ప్రయాణం ప్రారంభమైంది. నదిలో నీటి ప్రవాహం పెరగడంతో ఒడిశా- ఆంధ్రా సరిహద్దులోని నదీతీర గ్రామాల ప్రజల రాకపోకలకు వీలుగా పడవ నడుపుతున్నారు. నేరడి-బి, సింగిడి, సొలికిరి, తాలాడ, కీసర రేవుల్లో ఒడిశా- ఆంధ్రా మధ్య పడవలు నడుపుతున్నారు.

ట్రైకార్ రుణాల రికవరీ



ట్రైకార్ రుణాలు తీసుకున్న లబ్ధిదారులతో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ మణికుమార్

కురుపాం: ఐటీడీఏ పరిధిలో గిరిజన లబ్ధిదారులు ఇదివరలో తీసుకున్న ట్రైకార్ రుణాలను వెంటనే చెల్లించాలని గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజర్ సి.మణికుమార్ సూచించారు. కురుపాంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ట్రైకార్ రుణాలు తీసుకున్న లబ్ధిదారులతో గురువారం సమావేశమయ్యారు. రుణాల చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ కృష్ణవేణి, ఐటీడీఏ ఏపీఓ సురేష్‌కుమార్, ఏటీడబ్ల్యూఓ చంద్రబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

త్వరితగతిన రీ సర్వే



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలోని 152 గ్రామాల్లో భూముల రెండో విడత రీసర్వే వేగవంతంగా సాగుతోందని, మ్యూటేషన్లను సకాలంలో పూర్తిచేస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండోవిడత భూముల రీసర్వే, ఉపాధిహామీ పథకం, జగనన్న పాలవెల్లువ, పీఎం కిసాన్ ఈకేవైసీ, ఆధార్ సీడింగ్, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, జాతీయ రహదారులు, గృహనిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్‌ఓ జె.వెంకటరావు, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజీ, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా కోపరేటివ్ అధికారి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

అగ్నివీర్ ర్యాలీ ప్రారంభం



అగ్నిపథ్ ర్యాలీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కళాశాల మైదానంలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ గురువారం ప్రారంభమైంది. అర్ధరాత్రి నుంచే అభ్యర్థులు మైదానానికి చేరుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకూ వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యిమంది యువకులు దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొన్నారు. ముందుగా అడ్మిట్ కార్డులు పరిశీలించి, ఎత్తు కొలిచిన అనంతరం 1.6 కిలోమీటర్లు పరుగు పందెం నిర్వహించారు. తర్వాత పులప్స్, జిగ్జాగ్ వాకింగ్, డిచ్ జంపింగ్ తదితర శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వీటిలో అర్హత సాధించిన సుమారు 300 మందిని తదుపరి పరీక్షలకు ఎంపిక చేశారు. ర్యాలీ ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక పర్యవేక్షించారు.

ఐదో ఏటా.. అనుకూలమే..!

- ఖరీఫ్ సాగుకు కరుణిస్తున్న వరుణుడు
- ఉత్సాహంగా రైతన్నల పొలంబాట
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో విత్తనాలు
- గత చంద్రబాబు సర్కారు హయాంలో విత్తనాల కోసం అష్టకష్టాలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతతో మారిన చిత్రం
- మానసపుత్రిక ఆర్‌బీకేల ద్వారా రైతులకు సాగు సాయం
- సకాలంలో విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే అందజేత

నాడు: ఈ చిత్రం చూశారా? ఇది ఇప్పటిది కాదు... చంద్రబాబు నేతృత్వంలోని గత టీడీపీ ప్రభుత్వ అడ్డదిడ్డ నిర్ణయాల ఫలితంగా రైతులు పడుతున్న కష్టాలకు నిదర్శనమిది. 2018 ఖరీఫ్ సీజన్‌లో రేగిడి మండల కేంద్రంలో విత్తనాల కోసం రైతుల పాట్లుకు ఇది అద్దం పడుతోంది.



నేడు: ఇది ఇప్పటి చిత్రం. అదే రేగిడి మండలంలోని వన్నలి గ్రామంలోని వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం (ఆర్‌బీకే) వద్ద నుంచి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రైతులు విత్తనాలు తీసుకుంటున్న దృశ్యం. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు, దూరదృష్టికి ఇదొక తార్కాణం. సకాలంలో అదీ గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు అందిస్తే రైతు ముఖంలో ఎంత సంతోషం కనిపిస్తుందో, ఎంత ధైర్యంగా ఉంటారో చెప్పడానికి ఈ చిత్రమే నిదర్శనం.



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రైతులకు గత టీడీపీ పాలన ఓ పీడకల. ఖరీఫ్ సీజన్ వస్తుందంటే కాళరాత్రులే. విత్తనాలు, ఎరువుల కోసం రేయింబవళ్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి కేంద్రాల (పీఏసీఎస్) ముందు, మండల కేంద్రాల్లోని ప్రైవేట్ దుకాణాల ముందు బారులు తీరేవారు. అదీ రోజుల తరబడి ఈ ప్రహసనం సాగేది. వెబ్‌ల్యాండ్‌లో భూమి వివరాల ఆధారంగా విత్తనాలు ఇస్తామంటూ నాటి టీడీపీ సర్కారు మెలిక పెట్టడం వల్ల విత్తనాలు సక్రమంగా అందకపోగా వారికి కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. భూముల వివరాలు ఆన్‌లైన్‌లో సరిగా నమోదుగాకపోవడం, ఆధార్‌తో ఆ వివరాలు అనుసంధానం చేయకపోవడం, బయోమెట్రిక్ సరిగా నమోదవ్వకపోవడం.. ఇలా ఒకటేమిటి సంస్కరణల పేరుతో రైతులకు చుక్కలు చూపించారు. తీరా ఇన్ని కష్టాలు పడి విత్తనాలు విత్తేసరికి సమయం దాటిపోయేది. అయినా మొండిగా రైతులు ముందుకెళ్లినా వాతావరణం అనుకూలించేది కాదు. నాటి టీడీపీ ఐదేళ్ల పాలనలో కష్టాలు, కన్నీళ్లను చూసిన రైతులకు.. వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) సంజీవనిలా ఊపిరిపోశాయి. సొంత గ్రామాల్లోనే సకాలంలో కోరుకున్న విత్తనాలను అందిస్తున్నాయి. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రిక అయిన ఈ ఆర్‌బీకేల సేవలు నేడు ప్రశంసలు అందుకుంటున్నాయి.



సాలూరు మండలం మామిడిపల్లి ఆర్బీకేలో ఎరువులు, పురుగుల మందుల పంపిణీ

పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కరువు కానరాని గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మే నుంచే అందుబాటులోకి...

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు ప్రణాళికలతో అధికారులు సన్నద్ధమయ్యారు. ఫలితంగా మే నెల 15వ తేదీ నుంచే రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచారు. విజయనగరం జిల్లాలో సుమారు 93 వేల హెక్టార్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 35 వేల హెక్టార్లలో వరి సాగుభూమి ఉంది. అందుకు తగినట్లుగా విజయనగరం జిల్లాలోని 412 ఆర్‌బీకేల వద్ద 45 వేల క్వింటాళ్లు, పార్వతీపురం మన్యం జిల్లాలోని 306 ఆర్‌బీకేల వద్ద 24 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను మే నాటికే అధికారులు సిద్ధంగా ఉంచారు. ఇప్పటివరకూ విజయనగరం జిల్లాలోని 40,093 క్వింటాళ్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 22,839 క్వింటాళ్ల విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు.

కాలం మారింది...

ఖరీఫ్ ప్రారంభంలో వరుణుడు కాస్త ముఖం చాటేసినా తర్వాత కాలం మారింది. జూన్ నెలలో లోటు వర్షపాతమే కనిపించింది. ఈ నెలలో ఇప్పటివరకూ మెరుగైన స్థాయిలో వర్షాలు పడ్డాయి. సాధారణ వర్షపాతం కన్నా విజయనగరం జిల్లాలో 73 శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 18.4 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. గత నాలుగేళ్ల మాదిరిగానే ఈసారి కూడా రైతులు ఆశాభావంతో ఉన్నారు. రుతుపవనాల కదలిక కూడా ఆశాజనంగా ఉండటంతో ఉత్సాహంగా సాగుబాట పడుతున్నారు.

రైతులకు నిజమైన భరోసా...



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్‌బీకేల వల్ల రైతులకు నిజమైన భరోసా దొరికింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వరంగా మారాయి. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయసాగుకు ఉపకరించే పరికరాలు, యంత్రాలు అన్నీ ఒకేచోట లభిస్తున్నాయి. జగనన్నకు ధన్యవాదాలు.

– బోను గౌరినాయుడు, రైతు, శివరాంపురం, సాలూరు మండలం

ఆర్‌బీకేతో సాగు సాయం



గతంలో ప్రతీ ఏడాది ఖరీఫ్ సీజన్ వస్తే చాలు విత్తనాలు, ఎరువుల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత మా గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించారు. ఏ విత్తనాలు కావాలన్నా, ఎరువులు కావాలన్నా సకాలంలో అందుబాటులోకి ఉంటున్నాయి.

– ఎత్తుల శ్రీనువాసరావు, రైతు, అలజంగి, బీపురుపల్లి మండలం

వరి విత్తనాల సరఫరా (క్వింటాళ్లలో)		
రకం	విజయనగరం జిల్లా	పార్వతీపురం మన్యం జిల్లా
ఎంటీయూ–1121	31463.10	2930
బీపీటీ–3291	2730.80	817
బీపీటీ–5204	2171.70	982
ఎస్ఎల్ఆర్–34449	7.20	92
ఎంటీయూ–7029	1394.50	857
ఆర్‌జీఎల్–2537	130.80	4853
ఎంటీయూ–1224	55.20	3
ఎంటీయూ–1064	2106	11120
ఎంటీయూ–1061	20.70	1019
ఎంటీయూ–1318	11.10	0
ఆర్ఎన్ఆర్–15048	1.50	166
మొత్తం	40092.60	22839

విత్తన కష్టాలు తప్పాయి...



గత టీడీపీ ప్రభుత్వ సమయంలో మా గ్రామం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంతకవిటి మండల కేంద్రానికి విత్తనాల కోసం వెళ్లాల్సి వచ్చేది. అర్ధరాత్రి వెళ్లి గంటల కొద్దీ బారులు తీరేవాళ్లం. తీరా చాలీచాలనట్లే విత్తనాలు దొరికేవి. ఒక్కోసారి తోపులాటలు, గొడవలు జరిగేవి. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేవు. విత్తనాలు మా గ్రామ ఆర్‌బీకేకు ముందే వచ్చాయి. నాటి కష్టాలు తప్పాయి.

– వావిలపల్లి అనంతరావు రైతు, శ్రీహరినాయుడుపేట, రాజాం

దళారుల బెడద లేదు...



గతంలో వేలాది మంది రైతులు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఒకేసారి రావడంతో రోజుల తరబడి పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరాల్సి వచ్చేది. ఇలాంటి పరిస్థితుల్లో దళారులు పుట్టుకువచ్చారు. వారు చెప్పిన ధరకు విత్తనాలు, ఎరువులు కొనుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు గామంలోనే ఉన్న ఆర్‌బీకేలో కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఎప్పుడు కావాలనుకుంటే అప్పడు వెళ్లి తెచ్చుకుంటున్నాం. దళారుల బెడదా తప్పింది.

– లావేటి సత్తయ్య, రైతు, మరువాడ గ్రామం, బొండపల్లి మండలం.

పకడ్బందీగా ఓటర్ల సర్వే

- నేటి నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రారంభం
- నెలరోజులపాటు ఇంటింటి సర్వే
- అక్టోబర్ 17 న ముసాయిదా... ఓటర్ల జాబితా ప్రకటన
- ఒకే ఇంటినంబర్‌తో పదికిపైగా ఓట్లుంటే పరిశీలన
- మార్పులు, చేర్పులకు అవకాశం

పార్వతీపురం:

వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల సంఘం దృష్టిసారించింది. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలోని పేర్లు సరిచూడడం, సవరణ, కొత్త ఓటర్ల చేర్పించడంపై సర్వే చేయనున్నారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీనాటికి 18 ఏళ్లు నిండిన వారికి సైతం ఓటు హక్కు కల్పించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణపై బూత్ స్థాయి అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ పర్యవేక్షణకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించారు. వీరికి ఆయా మండలాల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల అధికారులు సహకారం అందిస్తారు. ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు సైతం అవగాహన కల్పించారు. తాజాగా లెక్కల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలో 2023 జనవరి నాటికి 10,25,430 మంది ఓటర్లు ఉన్నారు.

ఇంటింటి సర్వేలో పరిశీలించే అంశాలివే...

ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓటర్ల గుర్తింపు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, వందేళ్ల వయస్సు పైబడిన వారిని గుర్తించడం, డోర్ నంబర్లు, ఒకే డోర్ నంబర్‌తో పదుల సంఖ్యలో ఉన్న ఓట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. కొత్తగా ఏర్పడిన జగనన్న కాలనీలకు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉంటే కొత్తగా ఆయా ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటుకు సిఫార్సుచేస్తారు. దగ్గరలో పోలింగ్ కేంద్రాలుంటే వాటిలో ఆయా కాలనీల్లోని ఓట్లను విలీనం చేస్తారు. సర్వీసు ఓటర్లు (మిలటరీ), ఎన్ఆర్ఐ ఓటర్లను సరిచేస్తారు. దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉండాలో కనుక్కొని అక్కడి జాబితాలో పొందుపరుస్తారు. ఒక పోలింగ్‌బూత్‌లో 1500 పైబడి ఓట్లుంటే కొత్త పోలింగ్‌బూత్ ఏర్పాటుకు సిఫార్సు చేస్తారు. అందుకు అనువైన ప్రదేశాలను గుర్తిస్తారు. పేర్లు, నియోజకవర్గాలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డులో మార్పులు, చేర్పులు తప్పొప్పులు సరిచేయడం చేస్తారు. ఓటర్ల అభ్యర్థన మేరకు ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్పుచేస్తారు.

షెడ్యూల్ ఇలా...

జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటి బూత్ లెవెల్ అధికారులు సర్వేచేస్తారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు పోలింగ్ స్టేషన్ల సర్దుబాటు, విభజన, ప్రతీ పోలింగ్ స్టేషన్‌కు 1500 ఓట్లు ఉండేలా సర్దుబాటు, ఎక్కువ, తక్కువ ఓట్లు ఉంటే సమీప పోలింగ్ స్టేషన్‌లో కలపడం, గుర్తింపు కార్డులు, జాబితాల్లోని తప్పుల సవరణలు చేస్తారు. స్పష్టత లేని ఫొటోలను తొలగించి మంచి ఫొటోలను అప్‌లోడ్ చేస్తారు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు ఫారం-1 నుంచి ఫారం-8 వరకు పరిశీలన చేస్తారు. అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రకటన చేస్తారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. రెండు ఆది, రెండు శనివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను డిసెంబర్ 26 నాటికి పరిష్కరిస్తారు. 2024 జనవరి 1వ తేదీన సిద్ధం చేసిన ఓటర్ల జాబితాను ఆమోదానికి పంపిస్తారు. జనవరి 5న తుదిఓటర్ల జాబితా ప్రకటిస్తారు.



ఓటర్ల జాబితా

బూత్ మారితే ఫారం-8 ద్వారా మార్పు

పోలింగ్ బూత్ మారితే ఫారం-8 నింపి మార్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అద్దె ఇంట్లో నివాసం ఉండేవారి ఓటర్లు గత జాబితాలో ఉన్న ఇంటి నంబర్లలో లేకపోతే వారి ప్రస్తుత వివరాలను సేకరించి నమోదు చేస్తారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇప్పటికే పలుమార్లు సర్వేలు నిర్వహించి జాబితాకు తుదిరూపం తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. నియోజకవర్గంలో ఉంటూ పోలింగ్ బూత్ మారితేఫారం 8 ద్వారా బూత్ మార్పునకు అవకాశం ఉంటుంది.

పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీ..



జిల్లాలో ఓటర్ల జాబితా సవరణను హేతుబద్ధంగా చేపడుతున్నాం. తప్పులు లేని పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు తీసుకుంటున్నాం. పది మందికి పైగా ఓటర్లు ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో ఆయా మండలాల తహసీల్దార్లు స్వయంగా పరిశీలిస్తారు. 17ఏళ్లు పైబడిన వారికి, 18 ఏళ్లు నిండిన యువతీయువకులందరికీ ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం. కొత్త ఓటర్లతో పాటు ఓటు హక్కు లేనివారు, నియోజకవర్గం మారిన వారు తప్పనిసరిగా ఓట్లను నమోదు చేయించుకోవాలి.

– ఆర్.గోవిందరావు, జాయింట్ కలెక్టర్, పార్వతీపురం మన్యం

ఓటరు ధ్రువీకరణ సర్వేకు సహకరించండి

పార్వతీపురం: జిల్లాలో ఈ నెల 21 నుంచి చేపట్టే ఇంటింటి ఓటరు ధ్రువీకరణ సర్వేకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా పునఃశ్చరణపై కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో గురువారం సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్‌లెవెల్ ఏజెంట్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్‌ఓ జె. వెంకటరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎం.బాపూజీనాయుడు, పి.అప్పారావు, జి.వెంకటనాయుడు, జె.భాస్కరరావు, పి.రాజశేఖర్, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

ప్రతీ సెంటు భూమికి సాగునీరు



తోటపల్లి ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు

- తోటపల్లి ఎడమ కాలువకు 150 క్యూసెక్కుల నీరు విడుదల
- కుడికాలువకు 60 క్యూస్కెల నీరు
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు

వీరఘట్టం/గరుగుబిల్లి:

తోటపల్లి ఆయకట్టు పరిధిలోని ప్రతీ సెంటు భూమికి సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు వద్ద పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువలకు గురువారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. ఆర్‌బీకేల ద్వారా సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు సమకూర్చుతున్నట్టు వెల్లడించారు. రైతులు సాగునీటి వృథాను అరికట్టి పంటల సాగుకు వినియోగించుకోవాలని సూచించారు. శివారు ప్రాంతానికి సాగునీరునందించేందుకు జలవనరులశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తోటపల్లి ప్రాజెక్టు వద్ద 414 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఎడమ కాలువ రెగ్యులేటర్ నుంచి 150 క్యూసెక్కుల నీటిని, 106 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న పాత కుడి కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముందుగా నీటిని నేరుగా పాలకొండ శివారు వరకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు. నీటి విడుదలకు ముందు ఎడమ కాలువ రెగ్యులేటర్ వద్ద గంగమ్మ తల్లికి తోటపల్లి వేంకటేశ్వర ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆధునికీకరణ పనులపై ఆరా...

తోటపల్లి కాలువల ఆధునీకీకరణ పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, వచ్చే ఖరీఫ్ నాటికి ఈ పనులు పూర్తిచేయాలని కంబా జోగులు, విక్రాంత్‌లు అధికారులకు సూచించారు. ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం రూ.193.58 కోట్లు కేటాయించిందన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులపై ఆరా తీశారు. 37.536 కి.మీ. పొడవున ఉన్న ఎడమకాలువలో 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని జలవనరుల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకరరావు తెలిపారు. 17.616 కి.మీ పొడవున్న కుడికాలువలో 9.676 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టామన్నారు. మొత్తం 55.152 కి.మీ.కు ఇంత వరకు 26.519 కి.మీ అనగా 48 శాతం పనులు చేపట్టామని చెప్పారు.

64 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తాం...

తోటపల్లి ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 2.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2 టీఎంసీలు ఉందని డీఈఈ దమలపాటి రవికుమార్ తెలిపారు. ప్రాజెక్టులో గరిష్ఠ నీటినిల్వ 105 మీటర్లు కాగా ప్రస్తుతం 104.5 మీటర్ల నీరు నిల్వ ఉందన్నారు. కుడి, ఎడమ కాలువల పరిధిలో ఉన్న 64 వేల ఎకరాలకు ఖరీఫ్ చివరి వరకు సాగు నీరు అందిస్తామని తెలిపారు. సాగునీటి వృథాను అరికట్టేందుకు ప్రధాన బ్రాంచిల వద్ద మరమ్మతులకు గురైన షట్టర్లను తొలగించి కొత్త షట్టర్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విజయనగరం జెడ్పీ వైఎస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వీరఘట్టం, గరుగుబిల్లి, వంగర ఎంపీపీలు వెంకటరమణనాయుడు, రామారావు, సురేష్ ముఖర్జీ, పాలకొండ వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాశరావు, కరణం సుదర్శన్, పాలవలస ధవళేశ్వరరావు, ఏఈఓ గౌరీశంకర్, డి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎడమకాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

క్లుప్తంగా

వారణాసిలో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



వారణాసిలో పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు

విజయనగరం: జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడులు వారణాసిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మజ్జి శ్రీనివాసరావు తండ్రి నర్సింగరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు కుటుంబసమేతంగా కాశీ విశ్వేశ్వరుడు కొలువుదీరిన వారణాసిలో జెడ్పీ చైర్మన్ తన తండ్రి అస్థికలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఇరువురు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్‌పై విజిలెన్స్



ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, జీఎస్టీ అధికారులు

విజయనగరం క్రైమ్: విజిలెన్స్, జీఎస్టీ అధికారులు జిల్లాలోని పలు ట్రావెల్ ఏజెన్సీలను గురువారం తనిఖీ చేశారు. శ్రీకాకుళం నిఘా, అమలువిభాగం ఎస్పీ సురేష్ బాబు ఆదేశాల మేరకు సీఐ అప్పలనాయుడు, డీఈఈ సత్యనారాయణ, జీఎస్టీ అధికారులు పట్టణంలోని ట్రావెల్ ఏజెన్సీలకు వెళ్లారు. సక్రమంగా బిల్లింగ్ లేని సరుకులను గుర్తించి, వాటిని ఆపి వ్యాపారస్తులకు నోటీసులిచ్చారు. జీఎస్టీ ఎగవేతకు పాల్పడిన వ్యాపారస్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

గంజాయి నిందితుడి అరెస్టు



గంజాయి కేసు నిందితుడు బొంజునాయుడు

శృంగవరపుకోట: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్.కోట సీఐ బాలసూర్యారావు గురువారం తెలిపారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలకేంద్రానికి చెందిన లింగేటి బొంజునాయుడు ఏప్రిల్ నెలలో 124కిలోల గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. అయితే పోలీసుల కళ్లు గప్పి పరారైన బొంజునాయుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు.

చేనేత ఐక్యత రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సురేష్

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సకల చేనేత జనుల ఐక్యత రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన సురేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో తనను ఈ మేరకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. వెనుకబడిన కులాల ఐక్యత, చేనేత వృత్తిదారుల ఐక్యతకు కృషిచేస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

గిరిజన ఉత్సవాలను గౌరవంగా నిర్వహించాలి

పార్వతీపురం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు ఉట్టిపడేలా గిరిజన ఉత్సవాలను గౌరవంగా నిర్వహించాలని ఏపీఓ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఐటీడీఏ గిరిమిత్ర భవనంలో గిరిజన సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సంఘం నాయకులతో సమావేశాన్ని నిర్వహించి నాయకుల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, పి. సత్యనారాయణ, బి.తమ్మయ్య, ఎస్.సింహాచలం, ఎం.పారమ్మ, పి.రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,650-00
బంగారం(22సి. 10గ్రా.)	55,600-00
వెండి (కిలో)	82,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

ఘోషా ఆస్పత్రిలో సేవలు భేష్..!

- హైరిస్క్ గర్భిణులకు ప్రసవాలు
- గైనిక్ సమస్యలకు శస్త్రచికిత్స
- పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి రిఫరల్స్



ఘోషా ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: ఉత్తరాంధ్రలో పేరుగాంచిన ఘోషాఆస్పత్రిలో మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు భేషుగ్గా అందుతున్నాయి. దీంతో అధిక శాతం మంది మహిళలు ఇక్కడ సేవలు పొందడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రసవాల దగ్గర నుంచి మహిళలకు అన్ని రకాల గైనిక్ సమస్యలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. గైనిక్‌కు సంబంధించి స్పెలిస్టులు ఇక్కడ ఉండడంతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి నిత్యం రిఫర్‌ల్స్ వస్తున్నాయి. వీటికి కూడా ఇక్కడ సేవలను వైద్య సిబ్బంది అందిస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో చేరిన రోగులు సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన గర్భిణులు ప్రసవం కోసం ఘోషాఆస్పత్రికి వస్తున్నారు. జిల్లాతో పాటు శ్రీకాకుళంజిల్లా రణస్థలం, జి.సిగడాం, విశాఖపట్నం జిల్లా పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల నుంచి గర్భిణులు వస్తుండగా నెలకు 300 నుంచి 400 వరకు ప్రసవాలు ఘోషా ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు.

అందుబాటులోకి స్పెషలిస్టు వైద్యసేవలు

ఘోషా ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. సౌకర్యాలు కూడా మెరుగుపడ్డాయి. గతంలో సివిల్ అసిస్టెంట్స్ సర్జన్, సివిల్ సర్జన్స్ ఉండేవారు. ఇప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు వచ్చారు. అదే విధంగా పోస్టు గ్రాడ్యుయేట్స్ కూడా సేవలు అందిస్తున్నారు. దీంతో అత్యవసర పరిస్థితి ఉన్న గర్భిణులు, గైనిక్ సంబంధిత వ్యాధులకు చికిత్స, శస్త్రచికిత్సలు చేస్తున్నారు. హైబీపీ, బీపీ, సుగర్ ఉన్నవారు, హెచ్ఐవీ, క్షయ, రక్తహీనత, గుండె జబ్బులు ఉన్న రోగులను హైరిస్క్ గర్భిణులుగా గుర్తిస్తారు. అటువంటి హైరిస్క్ రోగులను పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి ఘోషా ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. హైరిస్క్ గర్భిణులకు అవకాశాన్ని బట్టి సుఖ ప్రసవం జరిపిస్తారు. అవసరమైన వారికి సిజేరియన్ చేస్తారు. అదేవిధంగా ల్యాప్రోస్కోపిక్ టూబెక్టమీ, శస్త్రచికిత్సలు కూడా ఇక్కడ చేస్తున్నారు. గైనిక్ సమస్యలకు సంబంధించి హిస్టెక్టమీ (గర్భసంచి) ఫైబ్రాయిడ్స్ (కణితుల తొలగింపు) వంటి అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తున్నారు.



వైద్య తనిఖీల కోసం వచ్చిన గర్భిణులు

ప్రసవాల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు

గర్భిణులకు సాధారణ ప్రసవంతో పాటు సిజేరియన్ చేయడానికి అవసరమైన సౌకర్యాలు ఘోషాఆస్పత్రిలో ఉన్నాయి. అదేవిధంగా గర్భిణులకు ఎక్కువగా రక్తం అవసరం పడుతుందని బ్లడ్ స్టోరేజ్ యూనిట్ కూడా ఏర్పాటు చేశారు.

అంకిత భావంతో వైద్యసిబ్బంది సేవ



ఘోషాఆస్పత్రిలో ఉన్న వైద్యులు అందరూ అంకిత భావంతో పనిచేస్తున్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణులకు కూడా ప్రసవాలు జరిపిస్తున్నారు. గైనిక్ సంబంధిత వ్యాధులతో వచ్చేవారికి అవసరమైన శస్త్రచికిత్సలు చేస్తున్నాం. అందరి రోగులను సమాన స్థాయిలో చూసుకుంటున్నాం.

డాక్టర్ అరుణ శుభశ్రీ,
డిప్యూటీ సూపరింటెండెంట్, ఘోషాఆస్పత్రి

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా సంతృప్తికర సేవలు

- నోడల్ అధికారి డాక్టర్ సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సూర్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు సంతృప్తి కర సేవలను అందిస్తున్నట్లు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నోడల్ అధికారి, జిల్లా అదనపు వైద్యాఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక 104 కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా జరుగుతోందన్నారు. గిరిజన, మారుమూల ప్రాంతాలకు సైతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అన్ని రకాల సేవలు ప్రజలకు అందించడం వల్ల ప్రజల వైద్యానికి అయ్యే ఖర్చు తగ్గిందన్నారు. 74 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రతి శిబిరానికి ఓపీ 70 నుంచి 100 వరకు వస్తుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగే గ్రామంలో ఒక రోజు ముందుగానే ప్రజలకు దండోరా ద్వారా తెలియజేస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందించే వైద్యసేవలను వినియోగించుకోవాలని కోరారు. 2022 అక్టోబర్ నెల నుంచి ఇప్పటి వరకు 3,28,087 మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. సమావేశంలో 104 జిల్లా మేనేజర్ బైరెడ్డి వినోద్‌కుమార్, 102 జిల్లా కో ఆర్డినేటర్ వరుణ్‌వర్మ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై లైంగికదాడి కేసు నమోదు

- డీఎస్పీ చక్రవర్తి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చక్రవర్తి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామానికి చెందిన యువకుడు వర్రి శివరాంపై లైంగికదాడి కేసు నమోదు చేశామని చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి తెలిపారు.ఈ సంఘటనకు సంబంధించి గరివిడి పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వెదుళ్లవలస గ్రామానికి చెందిన శివరాం..అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్న విషయం తెలిసి బాలిక తల్లి, గ్రామపెద్దలు ఆ యువకుడిని మందలించారు. గ్రామపెద్దలు మందలించిన తరువాత ఆ యువకుడు పనినిమిత్తం ఏలూరు వెళ్లిపోయాడు. అనంతరం బాలికకు మాయమాటలు చెప్పి ఏలూరు రప్పించాడు. ఈ విషయమై ఈనెల 11న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎల్.దామోదరరావు ఆధ్వర్యంలో గాలించి బాలికను రాజమండ్రిలో గుర్తించి తీసుకువచ్చారు. ఈ క్రమంలో తనపై పలుమార్లు శివరాం లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తెలియజేయడంతో లైంగికదాడి కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలియజేశారు. నిందితుడు శివరాంను పెనుబర్తి జంక్షన్ వద్ద పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో చీపురుపల్లి సీఐ సంజీవరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- సోషల్‌వెల్ఫేర్ డీడీ పీడక రత్నం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ పీడక రత్నం

కొత్తవలస: హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ పీడక రత్నం కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గల సోషల్‌వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ క్రమంలో కోటపాడు రోడ్డులో గల బీసీ బాలికల వసతి గృహంలోకి ఈ విద్యార్థులను మార్చి, ఆ వసతి గృహంలో ఉన్న విద్యార్థినులను ఈ హాస్టల్‌లోకి మార్చే విషయమై విద్యార్థులతో మాట్లాడారు. ఈ హాస్టల్‌ను వేరే చోటకు మార్చవద్దని ఆ హాస్టల్‌కు వెళ్తే మా స్కూల్‌కు వెళ్లేందుకు దూరమవతుందని ఇబ్బందులు తప్పవని విద్యార్థులు వివరించారు. విద్యార్థుల అభిప్రాయాలను, ఇక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె సమాధానమిచ్చారు. ఆమె వెంట వార్డెన్ దాసరి సత్యం తదితరులు ఉన్నారు.

నేడు ఈవీఎంల రాక

- కలెక్టర్ నిషాంత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు శుక్రవారం వస్తున్నాయని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలతో కలెక్టరేట్‌లో ఓటరు జాబితా పునశ్చరణపై గురువారం సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 3600 బ్యాలట్ యూనిట్లు, 2750 కంట్రోల్ యూనిట్లు వస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ యార్డు గొడౌన్‌లో ఈవీఎంలను భద్రవరుస్తామని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్ఓ జె. వెంకటరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎం.బాపూజీనాయుడు (వైఎస్సార్‌సీపీ), పారిసర్ల అప్పారావు (టీడీపీ), జాగాన భాస్కరరావు (కాంగ్రెస్), పి. రాజశేఖర్ (సీపీఎం), పైల శ్రీనివాసరావు(జనసేన) తదితరులు పాల్గొన్నారు.

పీఎం యశస్వి ప్రవేశ పరీక్షకు ఆహ్వానం

పార్వతీపురం: ప్రధానమంత్రి ఎంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ 2023-24 ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతులు, సాధికారిత అధికారి ఎస్. కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 2023 పీఎం యశస్వి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. పీఎం యశస్వి ప్రవేశ పరీక్ష సెప్టెంబర్ 29న జరుగుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 10తేదీలోగా హెచ్‌టీపీటీ//వైఈసీ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో చేర్పులు, మార్పుల కోసం ఆగస్టు 12 నుంచి 16 వరకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదుకు మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, ఆధార్ లింక్ చేసిన బ్యాంకు ఖాతా, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు

సివిల్స్, గ్రూప్-1, 2 పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ఏపీ స్టడీ సర్కిల్ నిర్ణయించిందని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి ఎండీ గయాజుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్స్‌కు విశాఖపట్నంలో, గ్రూప్-1కు విజయవాడలో గ్రూపు-2కు తిరుపతిలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ ఇతర కులాలకు చెందిన వారు, రూ.6లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు హెచ్‌టీటీపీ://ఏపీఎస్‌టీడీసీ.ఏపీసీఎఫ్‌ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశపరీక్ష ఆదారంగా శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేస్తామని వివరించారు.

ఆన్‌లైన్ యాప్‌లను నిషేధించాలి

- కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ నిరసన



నిరసన చేస్తున్న ఏఐవైఎఫ్ కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: ఆన్‌లైన్‌లో వస్తున్న అనేక యాప్‌ల వల్ల యువత భవిష్యత్త అగమ్యగోచరంగా మారిందని వాటిని నిషేధించాలని ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్న నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆన్‌లైన్ బెట్టింగ్ మొదలైన యాప్‌లను తక్షణమే ప్రభుత్వ నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ యాప్‌లో జరిగే నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, జి.నిఖిల్, లక్ష్మి, సంధ్య, శిరీష, మౌనిక, స్వాతి, సురేష్, సాయి, హర్ష, గోపి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రాకుండా చూసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ వారి జీవితంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధి రాకుండా చూసుకోవాలని సబ్ జైలు సూపరింటెండెంట్ టి.సంపత్ కుమార్ సూచించారు. ఈ మేరకు స్థానిక సబ్‌జైలులో గురువారం ఖైదీలకు హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బారిన పడిన తర్వాత బాధ పడేకంటే, వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. సన్మార్గంలో నడవడం ద్వారా హెచ్ఐవీ బారిన పడకుండా ఉండవచ్చని చెప్పారు. హెచ్ఐవీ బారినపడితే జీవింతాంతం మందులు వాడాల్సి ఉంటుందన్నారు. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపకూడదని కోరారు. ఏఆర్‌టీ కేంద్రంలో ఇచ్చే మందులు వాడడం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎం బాలాజీ, త్రినాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

బొబ్బిలి: ఉద్యోగం ఇప్పిస్తామని రూ.10లక్షలకు టోకరా వేసిందే కాక డబ్బులు అడిగిన పాపానికి దాడులకు తెగబడడం అన్యాయమని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సోరు సాంబయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు ధర్నా చేపట్టారు. స్వామి వారి వీధికి చెందిన ఉపాధ్యాయుడు చింతల సింహాచలం, లక్ష్మిదంపతులు ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలకడంతో అదే వీధికి చెందిన కర్రి ప్రభావతి రూ.10లక్షలు చెల్లించింది. చాలా రోజులుగా ఉద్యోగాలు లేక, డబ్బులూ ఇవ్వకపోవడంతో వెళ్లి నిలదీస్తే ఆ ఉపాధ్యాయుడి దంపతులతో పాటు వారి కుమారులు కూడా తనపై దాడి చేసినట్టు తహసీల్దార్ కార్యాలయంలో బాధితురాలు ప్రభావతి ఫిర్యాదు చేసింది. వెంటనే తన డబ్బు తనకు ఇప్పించాలని కోరింది. స్వామి వారి వీధి వాసులు ధర్నాలో పాల్గొన్నారు.

ఏడుతులాల బంగారు ఆభరణాల చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక పద్మావతి నగర్‌లో నివాసం ఉంటున్న రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్న హైందవి ఇంట్లో దొంగలు బుధవారం రాత్రి చొరబడ్డారు. ఆమె ఇంటి తలుపులు, తాళాలు పగుల గొట్టి, లోపలికి వెళ్లి కప్‌బోర్డు బీరువాలో ఉన్న ఏడుతులాల బంగారు ఆభరణాలను చోరీచేసి ఇల్లంతా చిందరవందర చేశారు. విషయం తెలుసుకున్న విజయనగరం డీఎస్పీ గోవిందరావు, రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్సై గణేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుపతిరావు తెలిపారు.

ప్రజా ప్రతినిధులు సహకరించాలి

- తహసీల్దార్ బంగార్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బంగార్రాజు

భోగాపురం: మండలంలోని 22 పంచాయతీల్లో పకడ్బందీగా రూపొందిచనున్న ఓటర్ల జాబితాకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఓలతో ఎంఆర్‌ఓ బంగార్రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న సమ్మర్ రివిజన్ కార్యక్రమంలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ జాబితా ప్రకారం సర్వే నిర్వహిస్తారన్నారు. గ్రామాల్లో లేకుండా బయట ప్రాంతాల్లో స్థిరపడిన వారిని, అదేవిధంగా మరణించిన వారిని ఓటర్ జాబితా నుంచి తొలగిస్తారని చెప్పారు. అదేవిధంగా మండలంలో ఉన్న ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా వివిధ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 53 పోలింగ్ స్టేషన్లకు ఓటర్లను సమానంగా సర్దుబాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన మండలశాఖ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కర్రోతు సత్యనారాయణ, వందనాల రమణ, డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్, బీఎస్పీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరుకొండ వెంకటరావు, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన గొలుసు దొంగ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పుల్లూరు శ్రీధర్ తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని రాజ్‌మహల్ కాలనీకి చెందిన సరోజిని మంగళవారం ఫ్లెటోవర్ కింద నుంచి గుడికి వెళ్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకుపోయిన నిందితుడిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ పుల్లూరు శ్రీధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యూపీలోని లక్నోకు చెందిన సతీష్ కుమార్ వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలోనే దొంగిలించిన నగతో ఉడాయించేందుకు బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో తచ్చాడుతుండగా పోలీసులు పట్టుకున్నారని చెప్పారు. బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. సమావేశంలో సీఐ ఎం.నాగేశ్వర రావు, ఎస్సై భాగ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార ప్రాముఖ్యత తెలుసుకోవాలి

విజయనగరం: గర్భిణులు పౌష్టికాహార ప్రాముఖ్యత తెలుసుకోవాలని రోటరీ మెయిన్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కె.కృష్ణశాంతి సూచించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గుంకలాం రామాలయంలో 15 మంది గర్భిణులకు గురువారం సామూహిక సీమంతం నిర్వహించి.. చీర, పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు, పువ్వులు, గాజులు అందజేశారు. అనంతరం తిరుమల మెడికోవర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణశాంతి మాట్లాడుతూ, పౌష్టికాహారం లోపిస్తే ప్రసవ సమయంలో ఇబ్బందులేర్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి నీతా వీజ్వానీ, ప్రతినిధులు మేఘరాజ్ రాథి, చంద్రశేఖర్, చెన్నయ్య శెట్టి, వీరభద్రరావు, ఉమా బాలాజీ, సూర్య లక్ష్మి, రాధిక, మంజుల, మాతృశ్రీ, రూప, రమ, గ్రామ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.